
నూరేళ్ళ తెలుగు కథకు

**నవ్య నీరాజనం**



నేను, మా ఎడిటర్ జగన్నాథశర్మగారు ఆ రోజు సాయంత్రం ఐదు గంటలకు జూబ్లీహిల్స్‌లోని మా కార్యాలయం నుంచి బయలుదేరాం. ట్రాఫిక్ పద్మవ్యూహంలోంచి, వడగాల్పుల్లోంచి విశాలాంధ్ర ప్రచురణాలయాన్ని చేరేప్పటికి ఆరున్నరయింది. పి. రాజేశ్వరరావుగారు తన చాంబర్‌లో కూర్చుని ఉన్నారు. వేడిగాలికి తోటకూర కాడల్లా అయిన మమ్మల్ని చూసి ముందుగా ముఖాలు కడుక్కోమన్నారు. చల్లటి నీళ్లు తెప్పించారు. తర్వాత చక్కటి కాఫీ తాగుతూ కబుర్లు మొదలు పెట్టాం. ఆయన ఇప్పుడు కూర్చున్న 'సీటు' వరకు ప్రయాణించిన దారిలోని ఎత్తుపల్లాలను వివరించారు.

### అమావాస్యకు పున్నమికి సెలవు

మాది అనంతపురం జిల్లాలోని చీమల వాగుపల్లె. నారాయణమ్మ, వెంగమనాయుడు మా అమ్మానాన్నలు. నేను ఫిబ్రవరి 13, 1951లో పుట్టాను. ఇంట్లో నేనే పెద్దవాడిని. నా తర్వాత ఇద్దరు తమ్ముళ్లు, ఒక చెల్లెలు. నా చదువు వీధిబడిలో మొదలయింది. మా పల్లెలో ఒక బ్రాహ్మణుడు ఉండేవాడు. ఆయన దేవాలయంలో పూజారి. అదే ఆలయంలో పిల్లలకు చదువు చెప్పేవాడు. ఒక్కొక్కరం యాభైపైసలు ఇచ్చేవాళ్లం. పొద్దన్నే ఆరుగంటలకే బడి మొదలయ్యేది. పదిగంటలకు ఒదిలేవాడు. మధ్యాహ్నం ఒకటి ఒకటిన్నరకు భోజనం కోసం వదిలి తిరిగి రెండు గంటలకు మొదలు పెట్టేవాడు. బడికి ఎవరు ముందుగా పోతారో వాళ్లు మిగిలిన వాళ్లందరి పేర్లు రాసి పెట్టాలి. బడికి వచ్చే రెండోవాడు రెండు గుంజీలు, మూడో వాడు మూడు గుంజీలు.. ఇలా ఉండేది పనిష్మెంట్. మాకు ప్రతి అమావాస్యకు, పున్నమికి సెలవు. బడిలో తరగతులు పెరిగే కొద్దీ కూర్చునే ఎత్తుకూడా పెరుగుతూ ఉంటుంది. వేసవి సెలవులు అయిపోయాక బడికి పోతే కూర్చునే ఎత్తు మారిందంటే అంతకు ముందు తరగతి పాస్ అయినట్టు లెక్క.

# కరవుసీమ వాసులే కథాభిమానులు!

**సాహిత్యంలో కథకులకు ఎంత ప్రాధాన్యం ఉందో, ఆ కథలను పుస్తకాలుగా ప్రచురించే వారికీ అంతే ప్రాధాన్యత ఉంది. మంచి కథలను మార్కెట్ చేయడంలో ప్రచురణకర్తల పాత్ర కీలకమ్మైంది. ఉత్తమ సాహిత్యాన్ని ప్రజల ముంగిటకు చేర్చటంలో ప్రచురణకర్తలదే ప్రధాన పాత్ర. ఈ నేపథ్యంలో విశాలాంధ్ర పుస్తక ప్రచురణాలయాన్ని ప్రముఖంగా పేర్కొనాలి. ఆ సంస్థకు సుమారు రెండు దశాబ్దాలకుపైగా మేనేజర్‌గా బాధ్యతలు నిర్వహిస్తూ, ఎన్నో కథల సంకలనాలను వెలువరించిన విశాలాంధ్ర మేనేజర్ పి. రాజేశ్వరరావు గురించి ఈ వారం మీ కోసం!!**

**- పి. రాజేశ్వరరావు**

### మ్యాథ్స్‌లో సెకండ్ మార్క్

మా పల్లెలో ఐదో తరగతి అయిపోయింది. ఇక ఆరు చదవాలంటే ఎలా? మా వూర్లో వాళ్లందరూ కలసి యాభై రూపాయల డబ్బు కట్టి జెడ్‌పిహెచ్‌ఎస్ తెచ్చుకున్నారు. కొట్టంలో హైస్కూల్ మొదలయింది. ప్రతి సంవత్సరం యాభై రూపాయలు కట్టి ఒక్కో క్లాస్‌ను తెచ్చుకుంటూ వచ్చాం. మా స్కూల్‌లో ఎస్ఎస్ఎ

లిసి ఫస్ట్ బ్యాచ్ మాదే. మ్యాథ్స్‌లో నాది సెకండ్ మార్క్.

### పగటిపూట కొర్రన్నం, రాత్రి వరన్నం

మాది పేద కుటుంబమే. ఇంట్లో పగటి పూట కొర్రన్నం వండేవారు. రాత్రి పూట మాత్రమే వరన్నం. కొర్రన్నం వేడిగా ఉంటే తినగలం. చల్లబడిందంటే తినడానికి ఇబ్బంది. నాకేమో వరన్నం ఇష్టం. ఇంట్లో ఎవరైనా వూరికిపోయినా, లేదంటే ఏదైనా అనారోగ్యంతో రాత్రిపూట అన్నం తినకపోతే నాకు ఆనందమేసేది. ఎందుకంటే పద్దన్నే ఆ అన్నం తినచ్చునని.

### ప్రాక్టికల్స్ ఎగ్గొట్టి ఎన్టీఆర్ సినిమాకు

అనంతపురం కాలేజీలో పియుసిలో చేరాను. మానాన్న కమ్యూనిస్టు పార్టీలో హోల్‌టైమర్. ఇంట్లో క్రమశిక్షణ ఎక్కువ. దీంతో పట్టణంలోకి రావడంతో నాకు పూర్తి స్వాతంత్రం వచ్చినట్టనిపించింది. నేను ఎన్‌టిఆర్ అభిమానిని. అప్పట్లో ఆయన సినిమా 'చిక్కడు దొరకడు'రిలీజ్ అయింది. మొదటి రోజే ప్రాక్టికల్స్ ఎగ్గొట్టి మొదటి ఆటకు పోయినా. అలా చదవడంతో పియుసిలో ఫెయిల్ అయిపోయినా.

### పగలు డ్యూటీ, రాత్రి చదువు

పియుసి ఫెయిల్ కావడంతో మానాన్న ఇక నన్ను చదివించలేనని, ఏదైనా ఉద్యోగం చూసుకోమని చెప్పాడు. నీలం రాజశేఖర్‌రెడ్డికి మానాన్న ఉత్తరం రాసిస్తే, జంపఖానా, దిండు, పెట్టె తీసుకుని 1970లో విజయవాడకు చేరా. అక్కడ విశాలాంధ్రలో చేరాను. పొద్దున్నే ఏడున్నరకు డ్యూటీకి పోతే సాయంత్రం ఆరుగంటలకు బయటొచ్చేవాడిని. సాయంత్రం కాలేజీలో చదువుకునే వాడిని. నాకు వంద రూపాయల జీతం ఇచ్చేవారు. అది సరిపోయేది కాదు. నాన్న దగ్గరనుంచి నెలకు ఇరవై రూపాయలు తెప్పించుకునేవాడిని. విశాలాంధ్రలో పేపర్‌లు కొనడం, ఇంక్‌లు, బోర్డ్ కొనడం నా పని. అప్పుడప్పుడు మద్రాసు పోయి వీటిని కొని తెచ్చేవాడిని. ఇప్పటికీ నేను పేపర్ పట్టుకుని దాని జి.ఎస్.ఎమ్. చెప్పగలను. ఎవరైనా భోజనానికి పోయినప్పుడు ప్రూఫ్ రీడింగ్ చేసేవాడిని. అలా మూడేళ్ల ఉద్యోగం చేస్తూనే డిగ్రీ పూర్తి చేశాను. ఎస్వీ యూనివర్శిటీలో ప్రైవేట్‌గా పి.జికి కట్టాను.

### వర్ణాంతర వివాహం

మొదట్నించీ నేను కట్నాలు తీసుకోవడానికి వ్యతిరేకిని. వేదికలెక్కి ఉపన్యాసాలు ఇవ్వడం కాదు, ఆచరణలో ఉండాలనేది నా అభిప్రాయం. అనంతపురంలో అయిదుకల్ల సదాశివన్ అని ఎక్స్ ఎమ్మెల్సీ ఉండేవాడు. ఆయన స్వాతంత్ర్య సమర యోధుడు. ఆయన రెండో అమ్మాయి ఐ.జ్యోతిర్మయితో నాకు మే 15, 1974న పెళ్లయింది. పెళ్లికి కట్నకానుకలు తీసుకోలేదు.

### కరప్షన్ ఎక్కువ

అనంతపురంలో కో-ఆపరేటివ్ సూపర్ బజార్‌ను ప్రారంభించారు. దానికి మొట్టమొదటి మేనేజర్‌ను నేనే. అక్కడ పని చేసిన అనుభవం తరువాత బాగా ఉపయోగపడింది. సూపర్ బజార్లో ప్రజలకు తక్కువ ధరకు నాణ్యతగల వస్తువులు అమ్మాలి. అయితే అక్కడ కరప్షన్ ఎక్కువ. అంతకుముందు మూడేళ్లు పనిచేసింది కరప్షన్ లేని చోట. ఇక్కడేమో పూర్తిగా దానికి వ్యతిరేకం. దాంతో అక్కడ ఇమడలేకపోయాను. దాంతో ఉద్యోగం వదిలేశాను.

### సొంతంగా బుక్‌స్టాల్..

సూపర్ బజార్‌లో ఉద్యోగం వదిలేశాను కదా. సొంతంగా ఒక బుక్‌స్టాల్ పెడదామని అనుకున్నాను. పదివేల రూపాయలకు విశాలాంధ్రవారి దగ్గరనుంచి పుస్తకాలు అప్పుగా ఇప్పించమని మా మామగారిని అడిగాను. అంత మొత్తానికి పుస్తకాలు అప్పుగా ఇస్తే వ్యాపారం సరిగా చేసుకోలేకపోతే..ఎంత కష్టం! ఎంత నష్టం అని మా మామ, నాన్న అభిప్రాయం. నేను పుస్తకాలు అడిగిన సంగతి మా మామ పార్టీ మీటింగ్‌లో చెప్పాడు. విజయవాడనుంచి మేనేజర్ వచ్చి 'అనంతపురంలో బుక్‌స్టాల్ పెడతాం. దానికి నువ్వే మేనేజర్‌గా ఉండు' అనిచెప్పాడు. వెంటనే ఒప్పుకున్నా. వారం రోజులు ట్రెయినింగ్ ఇచ్చారు. అక్టోబర్ 12, 1975న అనంతపురంలో విశాలాంధ్ర బుక్ హౌస్ ప్రారంభమయింది. నేను మేనేజర్‌ను. 75వేల రూపాయల పుస్తకాల అమ్మకం టార్గెట్ ఇచ్చారు. 85వేల రూపాయలకు అమ్మాను. ఎగ్జిబిషన్లు ఏర్పాటు చేశాం. స్వయంగా నేనే మైక్ పట్టుకుని 'మహాప్రస్థానం', 'దేవాలయాలమీద బూతుబొమ్మలు ఎందుకు' పుస్తకాల గురించి చెప్పేవాడిని. తర్వాత 1983లో అసిస్టెంట్ మేనేజర్‌గా విజయవాడకు వచ్చాను. అప్పటికి సంవత్సరానికి ఇరవై పుస్తకాలు అచ్చయ్యేవి. కమ్యూనిస్టు పుస్తకాలు,అభ్యుదయ భావాలున్న వారి పుస్తకాలు మాత్రమే వేసేవారు. అప్పట్లో సోవియట్ పుస్తకాలు ఎక్కువగా వచ్చేవి. ఒక వేళ అవి ఆగిపోతే ఎలా? అనే సందేహం నన్ను పీడించేది. మావాళ్లు 'లెఫ్ట్ అండ్ డెమోక్రాటిక్ అలయెన్స్' పాలసీని తెచ్చారు. దీంతో ఎక్కువ పుస్తకాలను వేసే వీలు కలిగింది.

### కాళ్లు కట్టేసినట్టుండేది..

విజయవాడలో ఉండగా నాకు కాళ్లు కట్టేసినట్టుండేది. వయసులో చిన్నవాడిని కదా, ఎక్కడ పొరపాటు చేస్తానో అని నా చర్యల్ని పరిశీలించేవారు ఎక్కువ. దాంతో స్వేచ్ఛగా పనిచేయలేకపోయేవాడిని. భవిష్యత్ దృష్ట్యా హైదరాబాదుకు మారితే బాగుంటుంది అనిపించింది. మే 1, 1985న హైదరాబాద్‌కు మా ఆఫీసు షిఫ్టయింది. యిక్కడికొచ్చాక స్వతంత్రంగా ఫీలయ్యా. అయితే హైదరాబాదులో మా సంస్థ పుస్తకాలు ఎవ్వరూ వేయలేదు. లెఫ్ట్ భావాలుండే ప్రభాకర్ 'నాట్యకళా ప్రెస్' నడిపేవాడు. ఆయన మొదట మా పుస్తకాలను వేశాడు. తర్వాత మిగిలిన వారూ మా పుస్తకాలు వేశారు.

### రచయితలతో ఇష్టాగోష్ఠి

రచయితలతో ఇష్టాగోష్ఠి ఏర్పాటు చేశాను. చాలా మంది రచయితలతో కలసి మాట్లాడాను. అప్పట్లో నవలలకు బాగా అమ్మకాలు ఉండేవి. చాలా ప్రచురణ సంస్థలు కూడా నవలలను ముద్రించేవి. కథ సంకలనాలు తక్కువ వచ్చేవి. రచయితలందరూ కథల పుస్తకాలు వేయాలని కోరారు. కొత్తవాళ్లవి కథలు ఎందుకు వేయరు? అని ప్రశ్నించారు. వెంటనే కేతు విశ్వనాథరెడ్డి, మధురాంతకం రాజారాం, వల్లంపాటి వెంకటసుబ్బయ్య, బలివాడ కాంతారావుగారితోపాటు ఎందరో రచయితల పుస్తకాలు వేశాం. వీరిలో చాలామందికి మేము ప్రచురించిన పుస్తకాలకు కేంద్రసాహిత్య అకాడమీ పురస్కారం లభించింది. అప్పట్నుంచి ప్రతీ సంవత్సరం కొత్త రచయితల పుస్తకాలను ప్రచురిస్తున్నాం.

### 'కథ' సంకలనాలకు మేమే స్ఫూర్తి

కందుకూరి వీరేశలింగం, గురజాడ, కొడవటిగంటి కుటుంబరావు, శ్రీశ్రీ, మల్లాది రామకృష్ణశాస్త్రిలాంటి వారి సాహిత్యమే కాకుండా 'తెలుగు కథకులు కథన రీతులు' పేరిట నూరుమంది తెలుగు కథకుల సాహిత్యాన్ని పరిచయం చేస్తూ నాలుగు సంకలనాలు వెలువరించాం. 'సీమకథలు', 'విశాలాంధ్ర తెలుగు కథ', 'తెలంగాణకథ'


ఎన్టీఆర్‌తో...

## నచ్చినవి

| | | |
|---|---|---|
| కథ | : | పుల్లంపేట జరీచీర |
| నవల | : | అమ్మ(గోర్కీ) |
| రచయిత | : | శ్రీపాద సుబ్రహ్మణ్య శాస్త్రి |
| కవి | : | శ్రీశ్రీ |
| పాట | : | ఏ నిముషానికి ఏమి జరుగునో(లవకుశ) |
| గాయని | : | సుశీల |
| గాయకుడు | : | ఘంటసాల |
| నటుడు | : | ఎన్.టి.ఆర్. |
| నటి | : | సావిత్రి |
| సినిమా | : | గుండమ్మ కథ |
| వ్యక్తి | : | చంద్ర రాజేశ్వరరావు |
| వంట | : | గోంగూర పచ్చడి |


కుటుంబ సభ్యులతో...

లాంటి సంకలనాలు తెచ్చాం. మేం విరివిగా తెస్తున్న కథల సంపుటాలు, సంకలనాలను చూసి ఆ స్ఫూర్తితో వార్షిక 'కథ' సంకలనాలను చాలామంది తెస్తున్నారు. హైదరాబాద్ బుక్‌ట్రస్టుకు మేమే స్ఫూర్తి. విశాలాంధ్రలో నేను చేరినప్పటికి సంవత్సరానికి ఇరవై పుస్తకాలు వేసేవారు. ఇప్పుడు రెండు రోజులకు ఒక పుస్తకం వేస్తున్నాం. రోజుకు ఒక పుస్తకం తేవాలని మా కోరిక. ఎందరో కొత్త రచయితలను ప్రోత్సహిస్తున్నాం. ఇంగ్లీష్‌లో కూడా ప్రచురణలు ప్రాంభించాం.

### కరువు సీమలోనే పుస్తకాలు కొంటున్నారు

రాయలసీమలో పుస్తకాలు కొనే హేబిట్ ఎక్కువ. అలాగే కళింగాంధ్రలో కూడా పుస్తకాలు ఎక్కువగా కొంటారు. కరువు ప్రాంతం ఎక్కడయితే ఉందో అక్కడంతా పుస్తకాలు ఎక్కువగా కొంటున్నారు. బాగా సంపన్న ప్రాంతాలైన కృష్ణా, గుంటూరు జిల్లాల్లో పుస్తకాల అమ్మకాలు తక్కువ.

### రచయితల ఆదరణ మరువలేనిది

1999లో గుంటూరులో 11.45 గంటలకు విశాఖ ఎక్స్‌ప్రెస్ ఎక్కాను. జారి రైలుకింద పడిపోయాను. అక్కడే ఒక చేయి పూర్తిగా, కాలు కొంతవరకు పోయాయి. రైలు ఆగింది. 'చనిపోయింటాడులే' అంటున్నారందరూ. అలాంటి పరిస్థితిలో కూడా కాన్షియస్‌గానే ఉన్నాను. "నేను బతికే ఉన్నాను. బయటకు తీయండి" అని కేకలు వేసాను. చాలా రోజులపాటు ఆసుపత్రిలో ఉన్నాను. తర్వాత ఇంటికి వచ్చాను. ఆ సమయంలో రచయితలు నా పట్ల చూపిన ప్రేమాభిమానాలు ఎప్పటికీ మరచిపోలేను. కొందరు రచయితలు ఉత్తరాలు రాశారు. కొందరు ఇంటికొచ్చి మాట్లాడి ధైర్యం చెప్పారు. కొందరు ఆర్థిక సాయం చేశారు. నాపట్ల ఇంత ప్రేమ చూపిస్తున్న రచయితలకు నేనేం చేశాను? నా డ్యూటీ నేను చేశానంతే కదా. నా జీవితం చివరి వరకూ మంచి పుస్తకాలు తేవాలని నేనారోజే నిర్ణయించుకున్నాను.

### నిద్రపట్టక రాయడం మొదలు పెట్టా

ఐదో తరగతినుంచి పుస్తకాలు బాగా చదివేవాడిని. ప్రేమ్‌చంద్ 'రంగభూమి', పెద్దిభొట్ల సుబ్బరామయ్యగారి కథలు ఆవయసులోనే చదివాను. బడిలేకపోయినా ఖాళీగా ఉంటే మానాన్న ఒప్పుకునే వాడు కాదు. ఏదో ఒక పుస్తకం చదవాల్సిందే. అలా నాకు చిన్నప్పటినుంచీ పుస్తకాలు చదివే అలవాటు. ట్రైన్ యాక్సిడెంట్ జరిగిందన్నాను కదా. ఆసుపత్రిలో ఉన్నన్ని రోజులు మత్తు మాత్రలు ఇచ్చేవారు. తర్వాత వాటిని మానేశారు. రాత్రులల్లో నిద్ర వచ్చేది కాదు. ఒక చేయి, కాలు లేవు కదా. కనీసం వాచ్‌మేన్‌గా కూడా పనికి రాను. నా పర్‌ఫార్మెన్స్ సరిగా లేదని మేనేజ్‌మెంట్ తొలగిస్తే నేనేం చేయాలి? అప్పుడు రాయడం మొదలు పెట్టాను. అలా మొదటి పుస్తకం తెలుగు సామెతల మీద తెచ్చాను. తర్వాత పిల్లల పుస్తకాలు.

### రాయలసీమ మట్టిలోనే పనిచేసే తత్వం

అనంతపురంలో మేనేజర్‌గా పని చేసిన రోజుల్లో డ్యూటీ అయిపోయాక మిగిలిన సమయాల్లో ఎక్కువగా చదివేవాడిని. ముఖ్యంగా మార్కెటింగ్, ఎడిటింగ్‌పై వచ్చిన చాలా పుస్తకాలు చదివాను. నన్ను మేనేజర్‌గా పెట్టారు. నన్ను నేను ప్రూవ్ చేసుకోవాలి. అసలు రాయలసీమ మట్టిలోనే పనిచేసే తత్వం ఉంది. అక్కడి పరిస్థితి అలాంటిది. కరువు. పని చేయకపోతే బతకలేం.

### 'ఒంటి' చేత్తోనే..

1984లో నేను చార్జ్ తీసుకున్నప్పటినుంచీ నాకు షుగర్, బిపి ఉన్నాయి. ఇవి నా ఉద్యోగ ధర్మంలో ఏనాడూ ఆటంకం కాలేదు. ప్రస్తుతం రాష్ట్రవ్యాప్తంగా 9 షోరూంలు, 3 సంచార పుస్తకాలయాల ద్వారా పుస్తకాలను అమ్ముతున్నాం. లక్షల్లో ఉండే మా వార్షిక టర్నోవర్ ప్రస్తుతం కోట్లకు చేరుకుంది. దాదాపు నూరుమంది స్టాఫ్ కృషి ఇందులో ఉంది. అందరూ అంటూ ఉంటారే 'వాడు ఒంటి చేత్తో పని చేస్తాడురా'అని. నేను నిజంగానే 'ఒంటి' చేత్తోనే పని చేస్తున్నాను. నా చిన్నతనం అంతా కష్టాల మయం. అందుకే దేనికీ నేను భయపడను. మరణం ముంచుకొచ్చినా కూడా పని చేసుకుంటూ పోవాలన్నదే నా కోరిక.

### ఆమె సహకారం గొప్పది

నా ఒంటిచేతి విజయం వెనక నా భార్య జ్యోతిర్మయి సహకారం మరువలేనిది. ఈ రోజు కూడా నేను ఇలా పనిచేస్తున్నానంటే దాని వెనక ఆమె ప్రోత్సాహం చాలా ఉంది. తను ఫాస్ట్ రీడర్. సాహిత్యం బాగా చదువుతుంది. నేను అనంతపురంలో ఉండగా నాకు నవలలు చదివే సమయం ఉండేది కాదు. అయితే నవలలో ఏముందో తెలీకుండా నేను పాఠకులకు ఎలా చెప్పి అమ్మగలను. అలాంటప్పుడు జ్యోతిర్మయి నవలలు చదివి నాకు కంటెంట్ చెప్పేది. దాన్ని పాఠకులకు చెప్పి పుస్తకాలు అమ్మేవాడిని. మాకు ఇద్దరు పిల్లలు. పెద్దమ్మాయి శైలజారావ్, చిన్నమ్మాయి గౌతమి. వీరు నేను ఏ పని చేస్తున్నా అభ్యంతర పెట్టలేదు. అడ్డూ చెప్పలేదు. మా ఆస్తంతా పుస్తకాలే. ఇంట్లో ఏ బల్లమీద చూసినా, ఏ షెల్ఫ్‌లో చూసినా పుస్తకాలే ఉంటాయి.

– సుంకోజి దేవేంద్రాచారి

**పి. రాజేశ్వరరావుకు బాగా నచ్చిన కథ**

# పుల్లంపేట జరీచీర

**- శ్రీపాద సుబ్రహ్మణ్యశాస్త్రి**

**'మామిడి పిందెలించక్కున్నాయో...బాబోయ్ పద్దేనిమిది మూళ్ల పొడుగున్నట్లుంది....మా అమ్మ ఇలాంటిది ఒక్కటీ పెట్టలేకపోయింది....ఎన్నాళ్ల నుంచో మనసుపడుతున్నా నీ రంగు కోసం, పాపం, చెప్పినట్టు తెచ్చిపెట్టారు.'**

★★★

**యాజులు నెల్లూరి జిల్లా కోర్టులో గుమాస్తాగా ఉండినప్పటి సంగతి.**

**ఇక నెల పదిహేనురోజులుందనగా, సంకురాత్రి పండుక్కి రాధమ్మని పుట్టింటివారు తీసుకెళ్లరని తేలిపోయింది.**

**అప్పటికామె పద్ధెనిమిదేళ్ల పిల్ల. పండుగులనీ, పబ్బాలనీ, అచ్చట్లనీ, ముచ్చట్లనీ కిందా మీదా పడిపోతూ ఉండే వయస్సు. దగ్గిరగా ఉన్నంత కాలమూ పుట్టింటివారామెకి లాంఛనాలన్నీ బాగానే తీర్చేవారు. కానీ నెల్లూరికి, పిఠాపురానికీ రానూ పోనూ కూతురికీ, అల్లుడికీ కావలసిన రైలు ఖర్చుల మొత్తం తెలిసేటప్పటికి వారికి గుండెలాగిపోయాయి.**



ఇది ఆలోచించి చివరికి రాధమ్మ కూడా సరిపెట్టుకుంది.

మొదట మాత్రం తండ్రి రాసిన ఉత్తరం చూసుకొని ఆమె నిర్ఘాంతపడిపోయింది.

ఇది యాజులు గుర్తించాడు. అతని హృదయం దడదడ కొట్టుకుంది. కాని ఒక్క క్షణంలో తేరుకుని, ఆమె కళ్లల్లోకి జాలిగా చూసి, తన వెచ్చని పెదవులతో తాకి ఆమె పెదవులకు చలనం కలిగించుకున్నాడు.

తరువాత 'మడి కట్టుకోండి' అంటూ ఆమె వంటింట్లోకి వెళ్లిపోయింది.

అతను తాపితా కట్టుకున్నాడు. కుచ్చెళ్లు పోసుకునేటప్పుడు ''రెండేళ్ల కిందట విజయదశమినాడు నీ అత్తవారిచ్చారు నీకిది. ఇంత గొప్పవి కాకపోయినా, ప్రతీ సంవత్సరమూ నువ్వు నీ అత్తవారి బహుమతులు కట్టుకుంటూనే ఉన్నావు. కానీ పుట్టింటి వారిస్తూనే ఉన్నారు గదా, లోటు లేదు గదా అనుకుంటున్నావే కాని రాధకి నువ్వొక్క చీర అయినా కొనిపెట్టావా పాపం? చిలక వంటి పెళ్లానికి మొగుడు చూపించవలసిన మురిపెం ఇదేనా? చివరకి వొక్క రైక అయినా కుట్టించావా? నీకిది బాగుందనిపించిందా?'' అని ఎవరో నిలవతీసి అడిగినట్టనిపించింది.

దీంతో వల్లమాలిన సిగ్గు వచ్చి ఊదర గొట్టేసింది.

దాని మీది 'ఇప్పుడైనా రాధకొక మంచి చీర కొనిఇవ్వాల'నుకున్నాడు. 'ఇచ్చి తీరాలి. పండుక్కి కొత్త చీర లేని లోటు కలగనివ్వకూడదు' అని దృఢపరుచుకున్నాడు.

కానీ, డబ్బేది?

ఏనెల జీతం ఆనెలకే చాలీచాలనట్టుంది. అక్కడికీ నెల్లూరిలో ఇంటి అద్దెలు చౌక కనుక సరిపోయింది. కాని లేకపోతే ఎన్ని చేబదుళ్లు చేస్తూ ఎన్ని వొడిదుడుకులు పడవలసి వచ్చేదో?

రాధమ్మ కూడా పొదుపయిన మనిషి కనక ఆటసాగుతోంది. కానీ కాకపోతే, ఆ చేబదుళ్లకు సాయం ఎన్ని అరువులు పెరిగిపోయి ఉందునో?

ఏమైనా చీర కొనితీరాలని శపథం పట్టుకున్నాడు.

ఖర్చులు తగ్గించుకోడం తప్ప మార్గాంతరం కనపడలేదు. ఆ ఖర్చులలో నేనా సంసారం కోసం రాధమ్మ చేసేవాటిలో తగ్గించడానికి వీలు కనపడదు.

దీని మీద 'నా ఖర్చులు తగ్గించుకుంటా'నని అతను నిశ్చయించుకున్నాడు.

అది మొదలు, అతను నాటకాలకి వెళ్లడం కట్టిపెట్టేశాడు. పుస్తకాలు కొనడం మానేసి భాండాగారానికి వెళ్లసాగాడు. ఒకటి రెండు

వినోదయాత్రలు చాలించుకున్నాడు. కోర్టుకి వెళ్లేటప్పుడు, వచ్చేటప్పుడూ బండెక్కడం తగ్గించుకున్నాడు. మధ్యాహ్నం కోర్టు దగ్గర ఫలహారం ఒక్కటే కాదు, కాఫీ కూడా మానుకొన్నాడు.

పొద్దుటి పూట మాత్రం ఇంటి దగ్గర కాఫీ సేవ మానుకోలేదు. అంచేత రాధమ్మకిదేమీ తెలవకుండా జరిగిపోయింది.

***

ఆవేళ పెద్ద పండుగ.

మధ్యాహ్నం రెండు గంటల సమయంలో, యాజులు, రాధమ్మ ఏం చేస్తోందో చూద్దామని వసారాలోకి వెళ్లి జంట వెదురు కర్చీలో కూచున్నాడు. ఉన్న చీరల్లో మంచివి నాలుగు పట్టుకు వచ్చి 'వీట్లో ఏది కట్టుకోను చెప్పండి' అంటూ రాధమ్మ పక్కన కూచుంది.

''నన్నడగడం ఎందుకూ?''

''మంచి చీర కట్టుకోవడం మీ కోసమా? నా కోసమా?''

''నా కోసమే అయితే, ఆ చీరలన్నీ మీవాళ్లిచ్చినవి. వాటి మీద నాకేమీ అధికారం లేదు.''

''అదేమిటండీ?''

''ఎకసక్కెం చెయ్యడం లేదు నేను.''

''చె-ప్పండీ పెడర్థాలు తియ్యకా.''

ఇలా గునుస్తూ ఆమె కుడిచెయ్యి అతని నడుముకి చుట్టేసింది.

దాని మీది, ఆనందమూ, ఉద్వేగమూ అతి కష్టం మీద అణచుకుంటూ అతను ''నేను మానెయ్యమన్నది మానేసి కట్టుకోమన్నది కట్టుకుంటావా?'' అని గంభీరంగా ప్రశ్నించాడు.

''ఆ''

''అయితే, అవన్నీ పెట్టెలో పెట్టేసి రా''

ఆమెకేమీ అర్థం కాలేదు. అయినా, ఏదో లేకుండా అతనలా చెప్పడని యెరుగును కనుక, అతనికి అడ్డుమాట చెప్పలేదు కూడా కనుక, వొక్క మాటు గంభీరంగా చూసి అవి ఇంటో పెట్టేసి వచ్చి, మళ్లీ పక్కన కూచుని 'మరి చెప్పండి' అని అడిగింది.

వెంటనే అతనొక్క మాటు మందహాసం మొలిపించి, అతి తాపీగా లేచి, అతి దర్జాగా వాకిట్లోకి వెళ్లి మేజా సొరుగులో నుంచి వొక పొట్లం తీసుకువచ్చి అతి ప్రేమతో ఆమెకందించి దగ్గిరగా కూచున్నాడు.

ఆమె చేతులు గబగబలాడిపోయాయి.

విప్పి చూడగా, అల్లనేరేడు పండు చాయతో నిగ నిగ మెరిసిపోతూ పుల్లంపేట జరీచీర.

''ఇదెలా వచ్చిందండీ?'' అని అడుగుతూ ఆమె మడత విప్పింది. వెంటనే మైజారు కొంగున ఉన్న జరీ నిగనిగ ఆమె కళ్లలోనూ, చెక్కిళ్ల మీదా, పెదవుల మీదా తళుక్కుమంది.

దాంతో అతని మొగం మరీ గంభీరముద్ర వహించింది.

''చెప్పండీ''

''వెళ్లి కట్టుకురా..''

''మానేస్తానా ఏమిటి చె-ప్పండీ''

''చెప్పనా ఏమిటి కట్టుకురా''

ఆమె గదిలోకి వెళ్లి మడత పూర్తిగా విప్పగా ఏదో కింద పడింది. ''ఇందులో పట్టు జాకెట్టు కూడా ఉందండీ?''

''ఇంకేం తొడుక్కురా''

యాజులిక్కడ మాట్లాడకుండానే కూచున్నాడు. కాని 'మామిడిపిందెలించక్కున్నాయో!' 'బాబోయ్ పద్దెనిమిది మూళ్ల పొడుగున్నట్లుంది.' 'మా అమ్మ ఇలాంటిది వొక్కటీ పెట్టలేకపోయింది.' 'ఎన్నాళ్ల నుంచో మనసుపడుతున్నా నీరంగు కోసం. పాపం, చెప్పినట్టు తెచ్చిపెట్టారు' అంటూ అక్కడ రాధమ్మ రిమార్కుల మీద రిమార్కులు దొర్లించేసింది.

అది విని తన కష్టం పూర్తిగా ఫలించినందుకతను చాలా సంతోషించాడు.

తరువాత ముసి ముసి నవ్వులు నవ్వుకుంటూ వచ్చి వొళ్లో కూచుని ఆమె ''ఇదెలా వచ్చింది చెప్పరూ?'' అని మళ్లీ అడిగింది.

''పుల్లంపేటలో వొక దేవాంగి నేశాడు.''

''ఊహూ''

''అది తెప్పించి నాతా సుదర్శనశెట్టి నెల్లూరి పెద్ద బజారులో పెట్టి అమ్మాడు.''

''సరే''

''నేను కొన్నాను.''

''బాగుంది''

''నువ్వు కట్టుకొన్నావు.''

''ఎలా వచ్చిందీ?''

''మళ్లీ మొదలా?''

''మరి నా ప్రశ్న అలాగే ఉండిపోయింది కదూ!''

''లేదు, బాగా ఆలోచించుకో.''

''పోనీ, ఇది చెప్పండి డబ్బెక్కడిదీ?''

''మన ఇంటోదే!''

''నాకు తెలవకుండా ఎలా వచ్చిందీ?''

''మిగిలిస్తే వచ్చింది.''

''ఎవరూ?''

''నేను.''

''ఎలా మిగిల్చారూ?''

'అతను రెప్పవెయ్యకుండా చూశాడు.'

''చెప్పరు కదూ? అయితే నన్ను''

''ఆగు...ఆగు...ఇవాళ పెద్ద పండుగ. అలాంటి మాటలు రాకూడదు.''

''అయితే మరి చెప్పండి.''

యాజులు జరిగిందంతా చెప్పాడు. కానీ, నమ్మలేక ఆమె 'నిజంగా?' అని చెయ్యి చాపింది.

''అక్షరాలా నిజం. ముమ్మాటికి నిజం'' అంటూ అతనాచేతిలో చెయ్యి వేసి, ఆ చెయ్యి గిల్లాడు.

ఆమె మనస్సు గుబగుబలాడిపోయింది. హృదయం నీరయిపోయింది. కళ్లు చెమ్మగిల్లాయి. ''చూశారా? నా చీర కోసం కారెండలో నడిచి వెళ్లారా? అక్కడ కడుపు మాడ్చుకొని ఉసూరుమంటూ పని చేశారా? చీర లేకపోతేనాకు పండగ వెళ్లదనుకున్నారా? నేను రాకాసినా?'' అని ఇక మాట్లాడలేక చేతులు అతని కంఠానికి పెనవేసి తన శిరస్సు అతని భుజం మీద ఆనుకుని దుఃఖించసాగింది.

అది చూసి, మొదట అతను నిర్విణ్ణుడయిపోయాడు. కానీ తరువాత ''ఛా! ఏడుస్తావా? నేను ఏది వద్దనుకున్నానో అదే చేస్తావా? ఇలా చూడు, అబ్బే! అయితే నాకూ నీకూ మాటల్లేవు. నాకూ నీకు జత లేదు.'' అని బెదిరిస్తూ మూతి బిడాయించుకుని ఆమె మొగం పైకెత్తి కొంటె చూపులు చూశాడు.

ఏడ్పల్లా ఆమెకి నవ్వయిపోయింది.

''మరి నాతో ఎందుకు చెప్పారు కారూ? నేను మాత్రం కాఫీ మానుకోకపోదునా? దాంతో మీక్కూడా జామారు రాకపోవునా?''

''ఇప్పుడురాకపోతేనా?''

''ఏదీ చూపించరూ?''

ఇద్దరూ లేచారు. ఒకర్ని వొకరు పొదివి పట్టుకుని వాకిట్లో మేజా దగ్గరకి వెళ్లారు. యాజులు సొరుగు లాగి వెంకటగిరి సరిగంచు చాపు పైకి తీశాడు.

అది చూసి, ఆమె సంతోష విహ్వాల అయి ''మరి తొరగా కట్టేసుకోండి'' అంటూ అని భుజాలు ఊపేసింది.

★

## ఈ కథ ఎందుకు నచ్చిందంటే..



'తెలుగు కథ అంటే ఇదీ' అని చెప్పవలసి వస్తే ముందుగా శ్రీపాద సుబ్రహ్మణ్యశాస్త్రిగారి పేరే చెప్పాల్సి వస్తుంది. ఈయన 'పుల్లంపేట జరీచీర' కథ నాకు చాలా యిష్టం. శ్రీపాదేమో గోదావరి ప్రాంతంవాడు. పుల్లంపేట ఏమో మా రాయలసీమలో ఉంది. ఆ ప్రాంతం వాడు మా ప్రాంతం పేరుతో కథ రాసాడే అని మొదట ఆసక్తిగా చదివాను. అయితే కథ కూడా చాలా బాగుంది. కథలోని భార్యాభర్తలు ఒకరిపట్ల ఒకరు ప్రేమను వ్యక్తం చేసుకునే తీరు నాకు చాలా నచ్చింది. అందుకే శ్రీపాదగారి 41 కథలతో మేం తెచ్చిన సంపుటికి 'పుల్లం పేట జరీచీర' అనే పేరు పెట్టాను.

– పి.రాజేశ్వరరావు